
# సింగిల్ పేజీ కథలు

## ఘరానామోసం

**పొద్దుటి నుండీ కురిసిన వాన వెలిసింది.**

**అర్జంటుగా పోస్టు చెయ్యాల్సిన కవరు తీసుకుని...**

**"ఏమోయ్! సికింద్రాబాదుదాకా వెళ్ళొస్తాను" అన్నాను శ్రీమతితో.**




"వచ్చేటప్పుడు మోండాలో కూరలు పట్రండి" అని సంచీ నా చేతికిచ్చింది.

నేను బయల్దేరుతుంటే.."బైక్ మీదెళ్ళరా?" అంది.

"ఈ వర్షంలో బైకా? పొద్దున్నే శుభ్రంగా తుడిచాను. బస్‌లో వెళ్ళొచ్చేస్తాలే"

"ఆ ఫ్రెండు కన్పించాడు, ఈ ఫ్రెండు కన్పించాడని..చెప్పిన పని మర్చిపోయొచ్చేరు, కూరలు నిండుకున్నాయి" అంది.

"అలాగే లేవోయ్" అని రోడ్డు మీదికొచ్చి, బస్టాప్ వరకూ జాగ్రత్తగా నడుస్తూ వచ్చాను. ఎందుకంటే మావీధి రోడ్డింకా సిమెంట్‌తో సింగారించుకోలేదు. రోడ్డంతా గుంటలే. గుంటలనిండా నీళ్ళే. ఏ కారో బైకో వచ్చి ఆ నీళ్ళ గుంటల్లో పడ్డదంటే...అంతే పాదచారుల బట్టలు ఆ బురదనీళ్ళతో జలకాలాడాల్సిందే.

బస్సెక్కి ప్యాట్నీ సెంటర్లో దిగి, పోస్టాఫీస్ వైపు నడుస్తుంటే వెనకనుంచి ఎవరో "మాస్టారూ! ఒక్క నిముషం" అనేసరికి, ఆగి వెనక్కి తిరిగాను. ఓ అపరిచిత వ్యక్తి నా వైపొస్తుంటే..టైమడుగుతాడేమోనని, అతని చేతివైపు చూశాను. వాచీ అతనికీ ఉంది.

నా దగ్గర కొచ్చి నిలబడి...

"సార్! మాది ఎల్బీనగర్, సికింద్రాబాదులో పనుండి బస్‌లో వస్తుంటే, నా పర్సెవరో కొట్టేశారు. నా ఎ.టి.ఎం. కార్డూ పర్సులోనూ ఉంది. తిరిగి వెళ్ళడానికి బస్ చార్జిక్కూడా పైసా లేదు. ఇంటినుండి హడావిడిగా బయల్దేరుతూ సెల్‌ఫోన్ తీసుకురావడం మర్చిపోయాను. బస్ ఛార్జి కోసం ఎవర్నడగాలన్నా, అభిమానం అడ్డొస్తోంది. మీరు ఏమీ అనుకోనంటే...బస్ ఛార్జికి డబ్బులిచ్చారంటే..మీ మేలు జన్మలో మర్చిపోను" అన్నాడు.

అతన్ని పైనుండి కిందికి చూశాను. అబద్ధం చెబుతున్నట్టన్పించలేదు.

"మీరేం చేస్తుంటారు?"

"ఎల్బీనగర్ ఎస్బీఐలో పన్జేస్తాను"

"బస్ టిక్కెట్టెంత?"

"బస్ టిక్కెట్టు ఏడు రూపాయలే..ఇలా జరగడం నాకిదే మొదటిసారి. ఎప్పుడూ ఎవరి దగ్గరా ఇలా చెయ్యి జాపలేదు. రేపే మీకు మనియార్డరు చేస్తాను. ఇరవై అయిదు రూపాయలిచ్చారంటే, మీకు మనియార్డరు పంపడానికి వీలుగా ఉంటుంది. అలాగే మీ అడ్రస్సూ రాసివ్వండి" అన్నాడతను.

"ఫరవాలేదు. మీరు మళ్ళీ పంపనక్కర్లేదు. బస్ ఛార్జికి సరిపడా తీసుకోండి"

"నా ఉద్దేశం మీ నుండి ఫ్రీగా తీసుకోవాలనిగాదు. మినిమం ఇరవై అయిదైతే మనియార్డరు చెయ్యడానికి వీలవుతుందని పోనీ మీకు అనుమానంగా ఉంటే..నా రిస్టువాచీ ఉంచుకోండి. మీ ఇంటి అడ్రస్సిస్తే, రేపొచ్చి పట్టుకెళ్తాను."

అతనంత ఇదిగా చెప్తుంటే శంకించడానికి మనసొప్పుకోలేదు.

పాకెట్లో ఉన్న పేపరుతీసి నా సైనిక్‌పురి ఇంటి అడ్రస్ రాసిస్తూ, పాతిక రూపాయలు ఇచ్చాను.

"సమయానికి ఆదుకున్నారు. మీకెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియటం లేదు. ఈ వాచీ ఉంచండి. రేప్పట్టుకెళ్తాను" అన్నాడు.

"వద్దండీ! మనిషిని మనిషి నమ్మకపోతే ఎలా...మీరు మనియార్డరు చెయ్యండి చాలు" అన్నాను.

"థ్యాంక్సండీ! థాంక్యూ వెరీమచ్. ఇది నా ఎడ్రస్" అని అతని పేరూ, అడ్రస్సూ రాసిచ్చాడు.

ఆపదలో ఉన్న వ్యక్తికి సహాయపడ్డాననే తృప్తితో నేను పోస్టాఫీసు వైపు వెళ్తుంటే, అతను బస్టాపు వైపెళ్ళాడు. నేను పని చూసుకుని, మోండాలో కూరలు తీసుకునేసరికి అర్ధగంట పట్టింది. బయల్దేరబోతుంటే మళ్ళీ వర్షం మొదలైంది.

అక్కడున్న ఆటో పిల్చి, ఎక్కడికెళ్ళాలో చెప్పి, "ఎంతిమ్మంటావ్" అన్నాను.

"మీటర్రేటివ్వండి సార్"

ఆటో ఎక్కికూచున్నాకగానీ గుర్తురాలేదు. ఇంటి నుండి బయల్దేరుతుంటే నా కూతురు పెన్ తెమ్మన్న సంగతి.

ఆటో డ్రైవరుకి చెప్పి, పక్కనే ఉన్న పెన్‌షాప్‌లో కెళ్ళాను.

ఐదారు రకాలు ముందుంచాడు. నచ్చింది తీసుకుని రాసి చూడటానికి పేపరడిగాను. రైటింగ్ ప్యాడ్‌లో ఉన్న పేపర్ తియ్యకుండానే, ప్యాడ్ నా ముందుకు జరిపాడు.

మొదట రెండు పిచ్చి గీతలు గీసి, అలవాటు ప్రకారం నా పేరు రాయబోతూ...గమనించాను. నేను రాస్తున్న పేపరు మీద, నా చేతి వ్రాతతో నా పేరు కన్పించినట్టన్పించింది. కళ్ళజోడు సరిచేసుకుని మళ్ళీ చూశాను. అనుమానం లేదు. అది నా దస్తూరే. నా పేరే. అది కొద్దిసేపటిక్రితం ఎల్బీనగర్, ఎస్బీఐ వ్యక్తికి నేను రాసిచ్చిన నా ఎడ్రస్ కాగితం. ఇంతలో ఇది ఈ షాపతనికి ఎలా

వచ్చింది?...అనుకుంటూ అదే విషయం షాపతన్ని అడిగాను.

"ఇదా! ఇప్పుడే సార్! ఐదు నిమిషాల ముందు ఒకాయన ఇచ్చెళ్ళాడు. సైనిక్‌పురి నుండి వస్తుంటే బస్‌లో పర్సెవరో కొట్టేశారట. సైనిక్‌పురి స్కూల్లో పన్జేస్తాడట. మా పిల్లలూ అదే స్కూల్లో చదువుతున్నారు. బస్ ఛార్జికి డబ్బుల్లేవని, పాతిక రూపాయలు ఇస్తే, రేపు మనియార్డరు ద్వారా పంపుతానన్నాడు. అనుమానంగా ఉంటే వాచి ఉంచుకోమని తీసివ్వబోయాడు. అతన్ని చూస్తే అనుమానించేలా లేడు. అతనుండే సైనిక్‌పురి అడ్రస్ రాసిచ్చెళ్ళాడు సార్. ఆ పేపరు ఈ ప్యాడ్‌లో ఉంచి, మర్చిపోయాను. ఇటివ్వండి" అని పేపరు తీసుకోబోయాడు.

విస్తుపోయిన నేను తేరుకుని అతనికి విషయం చెప్పి పెన్ తీసుకుని ఆటో ఎక్కాను.

మోసం చెయ్యడం కంటే మోసగింపబడటం, అందునా మోసగింపబడ్డామని తెల్సిన తర్వాత కలిగే మనోవేదన మెదడంతా ఆక్రమించుకుంది.

**-ఎం.వెంకటేశ్వరరావు** (సికిందరాబాద్)


# బాధ్యత

**తెలుగు మాష్టారుగా పనిచేస్తున్న మాధవయ్యగారికి ఆరోజు దినపత్రిక చదువుతుండగా ఒక టి.వి.ఛానల్ ప్రకటన ఆకర్షించింది. "ఈరోజు మాతృభాషా దినోత్సవం సందర్భంగా మాతృభాష గొప్పతనం మనమంతా గుర్తించే విధంగా మన తెలుగు భాష మాధుర్యం పై మీ అ ఆ టి.వి.వారు ఈరోజు ఉదయం పదిగంటల నుండి పదకొండు గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నారు.**

తెలుగు భాషాభిమానులు అందరూ ఈ చక్కని కార్యక్రమాన్ని వీక్షించి ఆనందించండి!" అన్న ఆ ప్రకటన చదివిన మాధవయ్య మాష్టార్‌కి చాలా ఆనందం కలిగింది. ఈమధ్యకాలంలో ఏ టి.వి.కార్యక్రమం చూసినా తెంగ్లీషు, హింగ్లీషు తప్ప స్వచ్ఛమైన తెలుగు విని ఎన్నిరోజులయ్యిందో కదా! అనుకొంటూ, ఈరోజు తప్పనిసరిగా ఈ ప్రత్యేక తెలుగు కార్యక్రమాన్ని చూడాలని సంకల్పించుకొన్నారు.

ఆరోజు పాఠశాలకి కూడా శెలవుదినం కావడంతో అలవాటుగా వెళ్ళే గ్రంథాలయం ప్రోగ్రాం మానుకొని ఉదయం పదిగంటలకి అ ఆ ఛానల్ ఆన్ చేశారు.

యాంకర్ ఆరణాల తెలుగు పడతిలా చక్కని కట్టు బొట్టుతో టి.వి.తెరమీద ప్రత్యక్షం కావడంతో మాధవయ్య మాష్టార్‌కి సంతోషమేసింది. యాంకర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ "ఈరోజ్ మాతృభాసా ధినోత్సవమ్ సందర్భంగా ఆంధ్రులంధర్కి శుభాక్కాంక్షల్" అనడంతోనే ఎంతో ఆసక్తిగా టి.వి. ఆన్ చేసిన మాధవయ్యమాష్టారి మనస్సు చివుక్కుమంది. యాంకర్ కంటిన్యూ చేస్తూ "ఈరోజ్ ఈ క్కార్యక్రమ్మమ్‌లో మన్మంతా థెలుగ్‌లోనే మాట్లాడ్థామ్. మన్మంతా ఆంధ్రుల్గ్గా పుట్టి మన థల్లి భాసన్ మర్చిఫోవడమ్ ధారుణమ్. చాల్‌మంది ఇంగ్లీష్ భాస మోజ్‌లో పడి థల్లి భాసను నిర్లక్ష్యమ్ చేస్థున్నార్. అంద్ కే ఈరోజ్ మాతృభాస ధినోత్సవమ్ సందర్భమ్‌గా మన థెలుగ్-వెలుగ్‌ను స్మరించ్ క్కొంధామ్" అంటూ గబగబా గడగడా తెలుగుభాషను దారుణంగా ఖూనీ చేస్తూ యాంకర్ మాట్లాడుతుండడంతో మాధవయ్య మాష్టార్‌కి చాలా కోపం వచ్చింది. మనస్సంతా మన తెలుగుభాషకు పట్టిన దుస్థితి తలుచుకొని కుమిలికుమిలి బాధపడుతున్నది. కార్యక్రమం ప్రారంభం నుంచీ యాంకర్ హొయలు తిరుగుతూ వంకర టింకరగా మాతృభాష దినోత్సవము రోజే మాతృభాషను సరిగా ఉచ్ఛరించలేక నగుబాటు చేస్తుండడంతో మాధవయ్య మాష్టారు టి.వి.ఆఫ్ చేసి, వెంటనే అ ఆ టి.వి.ఛానల్ వారికి ఫోన్ చేసి "మీ ఛానల్ ప్రసారం చేస్తున్న మాతృభాష ప్రత్యేక కార్యక్రమాన్ని నిలిపివేసి, తెలుగుభాష పరువు కాపాడండి" అని కోపంగా చెప్పినా, ఆ ఛానల్



వారు పట్టించుకోక, ఆ కార్యక్రమాన్ని అలాగే ప్రసారం చేసేశారు. ఆ రోజంతా మాధవయ్య మాష్టారు ఆలోచిస్తూనే ఉన్నారు. "తేనెకన్నా తియ్యనైన భాష మన తెలుగని" విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయులు ప్రశంసించారు. అలాగే "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్"గా ప్రఖ్యాతిగాంచిన తెలుగు భాషకు తెలుగునాట జరుగుతున్న అన్యాయాన్ని ఏ విధంగా అడ్డుకోవాలో ఆరోజు రాత్రంతా మాధవయ్య మాష్టారు ఆలోచించారు. "ఎవరికివారు నాకెందుకులే అని తెలుగుభాషకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా విడిచిపెడుతుండడం వలనే తెలుగు తన వైభవాన్ని కోల్పోతున్నది" అన్న సత్యాన్ని మాధవయ్య మాష్టారు గుర్తించారు.

'ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరిస్తే మన కమ్మనైన అమ్మ భాషకు ఈ రకమైన దుస్థితి పట్టి వుండేది కాదని' నిశ్చయించుకొన్నారు.

తాను కూడా ఓ బాధ్యత గల ఆంధ్రుడుగా తన తల్లి భాషను రక్షించుకోవాలంటే ఏమి చేయాలో ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాక నిశ్చింతగా నిద్రపోయారు.

ఉదయం నిద్రలేవగానే కాలకృత్యాలు తీర్చుకొని, పాఠశాలకి వెళ్ళి ఆరోజు శెలవుపెట్టి అటునుంచి అటే నేరుగా తన మిత్రుడైన లాయర్ రామానందం దగ్గరికి వెళ్ళారు మాధవయ్య మాష్టారు! మిత్రుడికి విషయమంతా వివరించి, తన ఆవేదన వెలిబుచ్చి అ ఆ టి.వి.ఛానల్‌పై "మాతృభాషాదినోత్సవ ప్రత్యేక కార్యక్రమానికి" సంబంధించి తెలుగు భాషా రక్షణకై కేసు ఫైల్ చేయించారు. తర్వాత రోజు తన పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వారిని ఒప్పించి, మాతృభాష పరిరక్షణకై తన పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో 'మాతృభాషాభివృద్ధి సంఘాన్ని' స్థాపించి భాషాభివృద్ధికి తన వంతు బాధ్యతను నెరవేర్చడానికి మాధవయ్య మాష్టారు ముందడుగు వేశారు. ఆ సంఘం ద్వారా ప్రతి నెల తెలుగు భాషకు సంబంధించి విద్యార్థులలో అంకిత భావం నెలకొల్పేందుకు వేమన, సుమతీ శతకాల పద్యాల పోటీలు నిర్వహించడానికి సంకల్పించుకొన్నారు.

**-మొర్రి గోపి** (కవిటి)